క్లుప్తంగా

శిక్షణ తరగతులు ప్రారంభం



రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న సీపీఐ నాయకులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రెస్‌క్లబ్ భవనంలో సీపీఐ జిల్లా స్థాయి సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ తరగతులను పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకరరావు ప్రారంభించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు అధ్యక్షత వహించగా ఎస్టీయూ సబ్ కమిటీ చీఫ్ అడ్వయిజర్ జె.ఏసురాజు తరగతులకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. పార్టీ సీనియర్ నాయకులు చెలికాని స్టాలిన్, దేవా రాజేంద్రప్రసాద్, సాగర్, జి.రవి, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ బి.బాలకృష్ణ పలు అంశాలపై ప్రసంగించారు.

వసతి గృహ నిర్మాణానికి రూ.1.55 లక్షలు



ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవికి విరాళం చెక్కును అందజేస్తున్న దాత పాపారావు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకుల వసతి గృహ నిర్మాణాలకు భాస్కర్‌నగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సుతాపల్లి పాపారావు, రత్నకుమారి దంపతులు రూ.1.55 లక్షల విరాళాన్ని సమకూర్చారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును దాతలు ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవికి శుక్రవారం అందజేశారు. ఆధ్యాత్మిక భావనతో ఆలయ అభివృద్ధికి తమ వంతు విరాళాన్ని అందించిన విశ్రాంత ఉపాధ్యాయుడు పాపారావు కుటుంబీకులను విరీతాదేవి అభినందించారు. పట్టణ వైఎస్సార్ సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



కాలిపోయిన తాటాకిల్లు

అల్లవరం: స్థానిక పంచాయతీ పరిధి గోసింగివారిపేటలో కొంబత్తుల శ్రీనుకు చెందిన తాటాకిల్లు శుక్రవారం అగ్నికి ఆహుతైంది. శ్రీను తనకు చెందిన స్థలంలో పక్కా గృహాన్ని నిర్మించుకునేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న తాటాకింట్లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం పొయ్యి నుంచి మంటలు ఎగసిపడి తాటాకిల్లు కాలిపోయింది. అందులో సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదం జరిగే సమయానికి తన చిన్న కుమారుడు నిద్రపోతున్నాడని, ప్రాణాలకు తెగించి కాపాడుకున్నామని శ్రీను తెలిపారు. స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పడంతో ప్రమాదం తప్పింది. ఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించి బాధితులను పరామర్శించారు.

కోర్టు తీర్పుపై హర్షం

ఉప్పలగుప్తం: రాహుల్ గాంధీకి విధించిన జైలు శిక్షపై సుప్రీంకోర్టు స్టే విధించటం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉప్పలగుప్తంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత తీర్పుతో ప్రజలకు న్యాయ వ్యవస్థపై గౌరవం పెరుగుతుందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు చీకట్ల అబ్బాయి, నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, దామిశెట్టి జయ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



ఎదుర్లంకలో బాధితులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న నాయకులు

ఐ.పోలవరం: ఎదుర్లంకలో వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులను జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముదునూరి కృష్ణార్జునరాజు, వీఆర్‌ఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టిప్పర్ దగ్ధం

ముమ్మిడివరం: అయినాపురంలో శుక్రవారం రాత్రి విద్యుత్ తీగలు తగిలి టిప్పర్ దగ్ధమైంది. గ్రామంలో రోడ్డు నిర్మాణానికి కంకర తీసుకువచ్చిన టిప్పర్‌ను 11 కేవీ విద్యుత్ తీగల కింద నిలిపి పైకి లేపడంతో వైర్లు తగిలి దగ్ధమైంది. ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్ టిప్పర్ పైనుంచి దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది.

పౌర సేవ... అత్యంత చేరువ

- సచివాలయాలతో ముంగిటకే సంక్షేమం
- అర్హులందరికీ పథకాల లబ్ధి



అల్లవరం: ప్రజలకు పాలన చేరువైంది.. సచివాలయాలతో ముంగిటకే సంక్షేమ రాజ్యం వచ్చింది.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాల లబ్ధి అందుతోంది.. గాంధీజీ కలలు గన్న స్వరాజ్య స్థాపనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి, 572 పౌర సేవలను అందించేందుకు 11 మంది సచివాలయ ఉద్యోగులను అందుబాటులో ఉంచారు. గ్రామ స్థాయిలో ఏ అవసరం వచ్చినా సచివాలయంలోనే సేవలు పొందేలా వాటిని తీర్చిదిద్దారు. అల్లవరం మండలంలో ఏర్పాటైన 23 సచివాలయాల ద్వారా ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఇప్పటికే సచివాలయాలకు పక్కా భవనాలు నిర్మించారు. ఈ వ్యవస్థకు అనుసంధానంగా ప్రతి 50 కుటుంబాలకు ఓ వలంటీర్ చొప్పున ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో వలంటీర్లు సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి వర్తింపజేసేందుకు సహకరిస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ల సొమ్మును నేరుగా ఇంటి వద్దే అందిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన నవరత్నాలను ఇంటింటికీ అందించే విధంగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేస్తున్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, చేదోడు, కాపు నేస్తం, నేతన్న నేస్తం, పింఛన్ కానుక, పంటల బీమా తదితర పథకాలను అందిస్తున్నారు. ఇవికాక పౌర సేవలు, జనన, మరణ ధ్రువపత్రాలు, భూ సంబంధిత మ్యూటేషన్లు, పీఎం కిసాన్, పేదలందరికీ ఇళ్లు, రేషన్ కార్డులో మార్పులు తదితర సేవలను అందిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పథకాల కోసం నాయకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేది. నేడు అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు ఇంటి తలుపు తట్టి వర్తింపజేస్తున్నారు. ఈ సేవలకు అన్నివర్గాల ప్రజలు జేజేలు పలుకుతున్నారు.

ఆర్థిక పరిస్థితి మెరుగు



ఇతని పేరు బడుగు కిరణ్‌కుమార్. గూడాలకు చెందిన ఆయన కుటుంబానికి మూడేళ్లుగా అమ్మ ఒడి సొమ్ము, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.21,321, రెండు పర్యాయాలు సున్నా వడ్డీ, అలాగే ఇళ్ల స్థలం అందింది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని కిరణ్ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



ఈమె పేరు షేక్ లాల్ బీబీ. అల్లవరంలో నివాసం ఉంటున్న ఆమెకు అందరికీ ఇళ్ల పథకంలో స్థలం, అమ్మ ఒడి, జగనన్న తోడు పథకాల ద్వారా లబ్ధి అందింది. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలం కోసం ఎదురు చూశారు. సీఎం జగనన్నతో సొంతింటి కల సాకారం అయ్యిందని, తమ కుటుంబం ఆయనకు రుణపడి ఉంటుందని బీబీ తెలిపారు.

పథకాలతో లబ్ధి



ఈమె పేరు చిన్నంశెట్టి వెంకటలక్ష్మి. మొగళ్లమూరుకు చెందిన ఆమె కుటుంబానికి జగనన్న చేదోడు, చేయూత, వైఎస్సార్ ఆసరా, పింఛన్, పీఎం కిసాన్, సున్నావడ్డీ రాయితీ, రైతు భరోసా పథకాల ద్వారా లబ్ధి జరిగింది. జగనన్న ప్రభుత్వంలో నేటి వరకూ వివిధ పథకాల ద్వారా రూ.2,41,750 ప్రయోజనం చేకూరింది.

అల్లవరం మండలంలో వివిధ పథకాల లబ్ధి ఇలా..

పథకం	లబ్ధిదారులు	మొత్తం రూ.కోట్లు
అమ్మఒడి	16,082	21.1
కాపు నేస్తం	3590	5.481
చేయూత	10,428	22.2
నేతన్న నేస్తం	25	0.06
ఆసరా	4,092	34.26
పింఛను కానుక	29,750	372.04
రైతు భరోసా	20,080	37.67
పంటల బీమా	3,327	2.30
ఇన్‌పుట్ సబ్సిడీ	3,297	2.58
మత్స్యకార భరోసా	2,168	2.55
వసతి దీవెన	5,857	6.21
విద్యా దీవెన	6,060	7.38
వాహనమిత్ర	1,239	1.24
చేదోడు	1,434	1.43
వైఎస్సార్ బీమా	74	0.9
ఆరోగ్య ఆసరా	84	0.85
ఈబీసీ నేస్తం	509	0.75
కల్యాణమస్తు	35	0.3
మత పెద్దలకు	76	0.41

కిమ్స్ కళాశాలలో సాయిధరమ్ తేజ్ సందడి



కిమ్స్‌లో వైద్య విద్యార్థులతో మాట్లాడుతున్న సాయిధరమ్ తేజ్

అమలాపురం రూరల్: అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో సినీ హీరో సాయిధరమ్ తేజ్ శుక్రవారం సందడి చేశారు. ఇక్కడ జరుగుతున్న స్మార్క్ సదస్సులో పాల్గొని వైద్య విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. స్మార్క్ 2023 మెడికోస్ కాన్ఫరెన్స్‌కు దక్షిణ భారత రాష్ట్రాల నుంచి సుమారు 2,500 వైద్య విద్యార్థులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా విలువైందని, ప్రణాళికాబద్ధంగా సాగి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ చైతన్యరాజు, ఎండీ రవికిరణ్‌వర్మ, డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం



న్యాయవాదులతో కలసి క్యారమ్స్ ఆడుతున్న జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ అసోసియేషన్ భవనంలో శుక్రవారం ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం న్యాయవాదులతో కలసి న్యాయమూర్తి నరేష్ క్యారమ్స్, చెస్ ఆటలు ఆడి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పలు ఆటలు ఆడి అలరించారు. పోటీల్లో విజేతలకు స్వాతంత్య్ర దినోత్సవం రోజున బహుమతుల ప్రదానం చేస్తామని అసోసియేషన్ తెలిపింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూపీ లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, ప్రధాన కార్యదర్శి బాబీ, కార్యదర్శి బడుగు భాస్కర్ జోగేష్, కోశాధికారి ఎం.చిన్నబ్బాయి, సీనియర్ న్యాయవాదులు నల్లా ప్రభాకరరావు, పినిపే రాధాకృష్ణ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ముంపు చేల పరిశీలన



అయినాపురంలో ముంపునకు గురైన నారుమడిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ముమ్మిడివరం: అయినాపురంలో వరదలకు ముంపునకు గురైన వరి చేలు, నారుమళ్లను శుక్రవారం మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల బృందం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. శాస్త్రవేత్తలు కేఎం దక్షిణమూర్తి, పీవీ రమణారావు, పీబీ ప్రదీప్‌కుమార్‌లు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. నీట మునిగిన నారుమడిలో ఎక్కువగా ఉన్న నీటిని వీలైనంత త్వరగా తొలగించి ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలన్నారు. అలాగే తెగుళ్ల బారిన పడకుండా నీటిని తొలగించి మొక్క నిలదొక్కుకున్న తరువాత లీటరు నీటిలో 2 మిల్లీలీటర్ల హెక్సాకోనజల్ ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఏఓ ప్రశాంతకుమార్, వీఏఏలు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, కృష్ణయ్య రైతులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: పేరూరులో వరద ముంపునకు గురైన వరి చేలను మార్టేరు ప్రాంతీయ వరి పరిశోధనా స్థానం ప్రిన్సిపల్ సైంటిస్టులు కేఎం దక్షిణామూర్తి, పీవీ రమణల బృందం పరిశీలించింది. ముంపునకు గురైన వరి చేలలో నీరు దిగిన వెంటనే తీసుకోవాల్సిన చర్యలను వారు వివరించారు. సహాయ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంఏ షంషీ, మండల వ్యవసాయ అధికారి కడలి ధర్మప్రసాద్, ఏఈఓ ప్రేమ్‌కుమార్, వీఏఏలు రవీంద్ర, రమా తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ బాధితులకు సాయం



మణిపూర్ బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న బైబిల్ మిషన్ సభ్యులు

అమలాపురం టౌన్: మణిపూర్‌లో దాడులకు గురైన బాధితులకు అమలాపురం బైబిల్ మిషన్ తన వంతు సాయం అందించింది. నాగాలాండ్ బోర్డర్ వద్ద బైబిల్ మిషన్ రూ.3 లక్షల విలువైన నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసి బాధితులకు పంపిణీ చేసింది. బైబిల్ మిషన్ ప్రతినిధులు రెవ. జయవరపు ఎర్రాయం, విక్టోరరాణి ఆధ్వర్యంలో మిషన్ సంఘ సభ్యులు, సేవకులు ఆ రాష్ట్రం వెళ్లి ఈ వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ నిత్యావసర వస్తువులను ఆ రాష్ట్రానికి చెందిన విద్యాశాఖ అధికారి రియోనియ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆ రాష్ట్ర ప్రభుత్వ గొడౌన్‌లో శుక్రవారం అప్పగించారు. వాటిని బాధితులకు పంపిణీ చేయనున్నారని బైబిల్ మిషన్ సంఘ సభ్యులు తెలిపారు.

అప్రెంటిస్‌షిప్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులు

అమలాపురం రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ అమలాపురం డిపోలో ఐటీఐ అప్రెంటిస్‌షిప్ చేయడానికి నిర్దేశించిన ట్రేడ్లలో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నారని డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి తెలిపారు. డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రిషియన్, వెల్డర్ ట్రేడ్లలో అభ్యర్థులు ఈ నెల 15 తేదీ లోపు అప్రెంటిస్ షిప్ కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. తర్వాత అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 18న ఉదయం 10 గంటలకు ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్, విజయనగరం వద్ద హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 08922- 294906 జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల, విజయనగరానికి చెందిన ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు



రెడ్డిపల్లిలో రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీహరి

అమలాపుర రూరల్: రెడ్డిపల్లిలో రహదారుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ కరాటం ప్రసన్న తెలిపారు. ఆ గ్రామంలో రూ.20 లక్షలతో రోడ్ల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. తొలుత ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్ భూమిపూజ చేశారు. రూ.1.80 కోట్లతో నిర్మించిన తారురోడ్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కట్టా సత్యబాబు, సెంట్రల్ డెల్టా చైర్మన్ కుడుపూడి బాబు, ఎంపీటీసీ సభ్యురాలు సత్తి భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు రేలంగి శ్రీను, రేలంగి దుర్గాప్రసాద్ (నాని), మాజీ సర్పంచ్ షేక్ అమీర్, నల్లా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల కంపెనీల కాలుష్యంపై ఆగ్రహం

- మండల సమావేశంలో సభ్యుల నిలదీత
- తక్షణ చర్యలకు ఎంపీపీ సునీత ఆదేశాలు



రొయ్యల కంపెనీల కాలుష్యంపై అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురంలో రొయ్యల కంపెనీల నుంచి వస్తున్న కాలుష్యంపై ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కోరంగి ఎంపీటీసీ సభ్యులు పాలెపు పోశియ్య, పోతుల రత్నకుమారి, రత్స ముత్యాలు తదితరులు ఆక్వా కాలుష్యం గురించి మాట్లాడారు. సుమారు 30పైగా కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలను ఆత్రేయ గోదావరిలోకి వదిలేస్తుండడంతో కలుషితంగా మారుతుందని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా వ్యర్థాలను రహదారుల చెంతనే వేయడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని, గుడివానితూము సెంటర్‌లో ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. దీనిపై కమిటీ వేసి ఆయా కంపెనీలలో పరిస్థితులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ సునీత మాట్లాడుతూ కాలుష్య కారకంగా మారుతున్న కంపెనీలపై మూడు రోజుల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పత్తిగొందిలో రొయ్యల చెరువుల కారణంగా వరి చేలకు తీవ్ర నష్టం జరుగుతుందని నీలపల్లి ఎంపీటీసీ దంగేటి సూరిబాబు తెలిపారు. ప్రస్తుతం డెంగీ ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ ఇబ్రహీం కోరారు. రైతులంతా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ ప్రశాంతి తెలిపారు. బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్లు ఐసీడీఎస్ విస్తరణాధికారి లలితా నిర్మల తెలిపారు. వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ పోతురాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వీట్ల పంపిణీ

యానాం: పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి జన్మదిన వేడుకలను స్థానిక రీజెన్సీ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రీజెన్సీ చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు సూచనల మేరకు రంగసామి పుట్టినరోజును నిర్వహించి 1,200 మంది విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. స్కూల్ హెచ్ఎం టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు మాట్లాడారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముమ్మిడివరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన పిండి ప్రసాద్ గత బుధవారం స్కూటర్‌పై వెళ్తూ కొమానపల్లి జాతీయ రహదారిపై అదుపుతప్పి పడిపోయాడు. దీంతో అతన్ని అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై కె.సురేష్‌బాబు కేసు నమోదు చేశారు.

డెవలప్‌మెంట్ కమిషనర్‌గా జవహర్

యానాం: పుదుచ్చేరి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కం డెవలప్‌మెంట్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి జవహర్‌ను నియమిస్తూ శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవవర్మ ఆదేశాలు జారీ చేశారు. జవహర్ గతంలో యానాం రీజినల్ అడ్మినిస్ట్రేటర్‌గా సమర్థవంతంగా పనిచేశారు.

ఈఎస్ఐ బిల్లులు చెల్లించండి

యానాం: స్థానిక ఈఎస్ఐ హాస్పిటల్ పరిధిలో వైద్యం చేయించుకుని ఈఎస్ఐ ద్వారా పెట్టుకున్న బిల్లులను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. గత రెండేళ్ల నుంచి బిల్లులు ఇవ్వడం లేదని కొంతమంది కార్మికులు సంఘ దృష్టికి తీసుకురావడంతో దుర్గాప్రసాద్ ఆస్పటల్‌ను సందర్శించి యూడీసీ రాంబాబును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కొన్ని బిల్లులు మంజూరయ్యాయని, మిగిలినవి త్వరలోనే మంజూరయ్యేలా చూస్తామన్నారు.

విద్యార్థుల పారిశ్రామిక పర్యటన



విజయవాడలో సీఐపీఈటీ వద్ద ఇంజినీరింగ్ విద్యార్థులు

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాసా ఇంజినీరింగ్ స్వయం ప్రతిపత్తి కళాశాల డిప్లొమా విద్యార్థులు విజయవాడలోని సీఐపీఈటీ వద్ద ప్లాస్టిక్ తయారీ యంత్రాలు, ప్రోసెసింగ్, టెస్టింగ్ తదితర విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కళాశాలలో ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు మాట్లాడుతూ డిప్లొమా చదువుతున్న మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రాజెక్టులు, పరిశోధనలకు పారిశ్రామిక పర్యటన దోహద పడుతుందన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, కళాశాల పాలక వర్గ సభ్యులు సందీప్, రమేష్‌రాజు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పౌష్టికాహారం



కామనగరువులో పౌష్టికాహార కిట్లు అందిస్తున్న సర్పంచ్ అరుణకుమారి

అమలాపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని సర్పంచ్ నక్కా అరుణకుమారి తెలిపారు. కామనగరువు పరిధిలో అప్పనపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ అధ్యక్షతన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద టేక్ హోమ్ రేషన్ కిట్లు అందజేశారు. దీనిని సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి ప్రారంభించారు. ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, ఎంపీటీసీ మెండు గంగాభవాని, కార్యదర్శి అడబాల రాజా, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. తాండవపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు, ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు, మాజీ సర్పంచ్ పరమట శరత్‌బాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పరమట శ్రీనివాసరావు పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే పౌష్టికాహార కిట్లు అందజేశారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



గోకనవిల్లిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామ పంచాయతీ పరిధి గోకనవిల్లిలో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రస్తుతం పంచాయతీ, ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, ముషిణి లింగేశ్వరరావు, రాంబాబు, జంగా నాగమణి, చేట్ల సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

తాళ్లరేవు: గాడిమొగలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించి సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటైన శిబిరాన్ని సర్పంచ్ కామాడి గోవలక్ష్మి ప్రారంభించారు. రిలయన్స్ మెడికల్ ఆఫీసర్ రాజేష్ నేతృత్వంలో వైద్యులు శ్యామ్, రేవంత్, ఈశ్వర్ బృందం సేవలందించారు. సంస్థ సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రిలయన్స్ ఏటా మూడు వైద్య శిబిరాలు నిర్వహిస్తుందన్నారు. మొదటి శిబిరాన్ని గాడిమొగలో ఏర్పాటు చేశామన్నారు. నాయకులు కామాడి మాతరాజు, వనమాడి వేణి, వైద్యులు శివప్రసాద్, పల్లెసిరి మురళి పాల్గొన్నారు.

పశుగ్రాసం పంపిణీ



పాడి రైతుకు పశుగ్రాసం పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ శ్రీహరి, సర్పంచ్ అరుణ

అమలాపురం రూరల్: పేరూరు తోట్లపాలెంలో వరదల కారణంగా ఇబ్బంది రాకుండా పశువులకు ప్రభుత్వం పశువుల దాణాను సమకూర్చింది. శుక్రవారం దీనిని సర్పంచ్ దాసరి అరుణడేవిడ్ అధ్యక్షతన పాడి పశువుల యజమానులకు జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్ పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు దొంగ ఆంజనేయులు, సచివాలయ కన్వీనర్లు రాచూరి సత్యప్రసాద్, తాడి రాజేంద్ర, డాక్టర్ సాహిత్య భక్త వీఎస్ఎస్ సురేష్, ఎ.విజయ దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఆర్ఎస్ఎస్ సూరపరాజు తదితరులు పాల్గొన్నారు.